క్లుప్తంగా

తెనాలిలో చిరు జల్లులు

తెనాలి అర్బన్: పట్టణంలో శనివారం సాయంత్రం చిరు జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి ఎండ కాసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. అనంతరం కొద్దిసేపటికే చిరు జల్లులతో వర్షం కురిసింది. సుమారు అరగంట సేపు పడి ఆగిపోయింది. సాయంత్రం వేళ కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు.

నేడు వృద్ధాప్య అనారోగ్యాలపై అవగాహన

తెనాలి: పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆగస్టు నెల సమావేశం ఆదివారం సాయంత్రం కవిరాజు పార్కులోని వీజీకే భవన్‌లో జరగనుంది. సాయంత్రం ఆరు గంటలకు ఆరంభమయ్యే సభకు అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహిస్తారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్ 'వృద్ధాప్యం–అనారోగ్య సమస్యలు' అంశంపై ప్రసంగిస్తారు. సభ్యుల సందేహాలకు సమాధానాలిస్తారు.

అబాకస్ పోటీల్లో సత్తా చాటిన తెనాలి విద్యార్థులు



తెనాలి: 'యూసీమాస్' సంస్థ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి, తర్వాత హైదరాబాద్‌లో జరిపిన జాతీయ స్థాయి అబాకస్ పోటీలో తెనాలిలోని మాస్టర్ బ్రెయిన్ అబాకస్ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటారు. వేలాదిగా పాల్గొన్న ఈ పోటీల్లో తెనాలి విద్యార్థులు టి.హేత్విక్, ఓ.షణ్ముఖ అభిరామ్, ఎ.విహాస్‌రామ్, కె.నాగహాష్విక్, ఎ.ప్రభంజన్, ఎస్‌డీ దీనాజ్‌రోష్ని, కె.నాగమిథున్, టి.తక్ష, వెంకటసాయి కిరణ్‌లు ప్రతిభ చూపి పలు అవార్డులను గెలుచుకున్నారు. విజేతలకు మాస్టర్ బ్రెయిన్ అబాకస్ డైరెక్టర్లు షేక్ షాఫియా, షేక్ షాకియాలు అభినందనలు తెలియజేశారు.

సబ్ రిజిస్ట్రార్‌గా హరికిషన్ బాధ్యతల స్వీకరణ



తెనాలి: పట్టణ కొత్తపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2గా మాదినేని హరికిషన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన ఆ తర్వాత చేబ్రోలు, గుంటూరులో పనిచేశారు. పదోన్నతిపై తెనాలికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన హరికిషన్‌ను సబ్ రిజిస్ట్రార్-1 కె.బుజ్జిబాబు, దస్తావేజు లేఖర్లు వజ్రాల రామలింగాచారి, వై.పేరయ్య, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు.

అన్న క్యాంటీన్‌కు ఆర్వో ప్లాంట్ వితరణ



తెనాలి టౌన్: స్థానిక బస్టాండ్ వద్ద గల అన్న క్యాంటీన్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్‌ను శనివారం వితరణగా అందజేశారు. రోటరీ– 3150 గవర్నర్ సోమవరపు వెంకట రామప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్లాంట్‌ను ప్రారంభించారు. దాతల సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సభ్యులు ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ముదావహమని కొనియాడారు. సంస్థ చేస్తున్న సేవలను వివరించారు. అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ కొడాలి వెంకటేశ్వరరావు, భారతీదేవి, కావూరి శివరామకృష్ణ, అఖిలాండేశ్వరమ్మ, డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్ సహకారంతో ఈ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, గుత్తా వెంకటరత్నం, పలువురు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

- నిలిచిన పనులు, అక్రమ నిర్మాణాలపై ప్రశ్నించిన కౌన్సిలర్లు
- రెండు గంటల పాటు వాడీవేడిగా సమావేశం
- ఒక్క అంశం మాత్రమే చదివిన అధికారులు
- మిగిలిన అన్నింటినీ ఆమోదించిన సభ్యులు



వైఎస్సార్ సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం



సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ రాధిక

తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గందరగోళంగా సాగింది. పట్టణంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులపై కౌన్సిలర్లు ఏకరువు పెట్టారు. అక్రమ నిర్మాణాలపై అధికారులను నిలదీశారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించి సమావేశాన్ని ముగించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే టీడీపీ కౌన్సిలర్ తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు లేచి, గంగానమ్మ తల్లి గుడి వద్ద రోడ్డు ఎందుకు నిర్మించటం లేదని ప్రశ్నించారు. పల్లంలో ఉండటం వల్ల చిన్నపాటి వర్షానికే నీరు నిలచిపోతోందని తెలిపారు. అది వ్యాపార కూడలి కావటం వల్ల వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వలపై ర్యాంప్‌లు ఉండటం వల్ల వ్యర్థాలు పేరుకుపోయి పారుదలేక సమస్యలు ఏర్పడ్డాయని మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్ తెలిపారు. మంజూరైన రోడ్డును ఎందుకు నిర్మించరో తెలియజేయాలని కౌన్సిలర్ కోరారు. రోడ్డుపై రోడ్డులు వేయమని ఎంఈ తెలిపారు. ఇంతలో టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి లేచారు. కౌన్సిలర్లకు గౌరవం ఇవ్వని ఎంఈని వెంటనే డీఎంఈకి సరెండర్ చేయాలని కోరారు. కౌన్సిల్ ఆమోదించిన పనులు ఎందుకు అడ్డుకుంటున్నారని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులను నిలదీశారు. వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

అక్రమ భవన నిర్మాణాలను ఆపేయండి !

తెనాలి పట్టణంలో యథేచ్ఛగా అక్రమ భవన నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు అడ్డుకోవడంలేదని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి ప్రశ్నించారు. ఏడాది నుంచి పట్టణంలో 4,5 అంతస్తుల నిర్మాణాలు ఆపిన అధికారులు, ఇప్పుడు కొందరికే ఎందుకు అనుమతులు ఇస్తున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు మొఘల్ అహ్మద్ బేగ్, ఆవుల కోటయ్య, షేక్ దుబాయ్ బాబు, పేరం సంజీవరెడ్డి ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం నోటీసులు ఇస్తున్నట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ తెలిపారు. ఇంతలో టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి లేచి, గత ప్రభుత్వ హయాంలో అనేక భవనాలను అనధికారికంగా నిర్మించారని ఆరోపించారు. దీంతో చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు ప్రతిపక్ష వార్డులపై వివక్ష చూపలేదని, అన్ని వార్డులను సమంగా అభివృద్ధి చేశామని వివరించారు. దీంతో ఇద్దరి మధ్యా వాగ్వివాదం జరిగింది. చైర్‌పర్సన్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు లేచి కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. దీంతో సమావేశం గందరగోళంగా మారడంతో చైర్‌పర్సన్ కొద్ది సేపు వాయిదా వేశారు.

ఖర్చులు లెక్క చెప్పాలి

అనంతరం జరిగిన సమావేశంలో అజెండాలోని మొదటి అంశం చదవడం పూర్తి కాగానే టీడీపీ కౌన్సిలర్ దేసు యుగంధర్ లేచి, రణరంగ చౌక్‌లో జరిగిన అమరవీరుల సంస్మరణ సభకు రూ.4లక్షలు దేనికి ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఖర్చు చేసేది రూ.లక్ష అయితే బిల్లుల మాత్రం రూ.4లక్షలకు ఎలా పెడతారని కౌన్సిలర్లు గోగిరెడ్డి మానసారెడ్డి, బ్రహ్మేశ్వరరావు ప్రశ్నించారు. దీనిపై విచారణ జరుపుతానని చైర్‌పర్సన్ హామీ ఇవ్వడంతో శాంతించారు. తన వార్డులో గుంతలు కూడా పూడ్చటం లేదని కోమరబత్తిని జయపాల్, వార్డులో అభివృద్ధి పనులు చేయించాలని షేక్ ఇస్మాయేల్‌లు, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అడుసుమల్లి వెంకటేశ్వరరావు, దాసరి వసంతరావు కోరారు. కమిటీలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య కోరుతూ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, పలువురు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఓ బొజ్జ గణపయ్య.. నీ బంటు నేనయ్యా !



తూములూరులో గణేష్ విగ్రహం ఊరేగింపు



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి



నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న కేరళ వాయిద్య కళాకారులు

- భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు
- పలుచోట్ల సందడిగా నిమజ్జనాలు

కొల్లిపర: వినాయక నవరాత్రుల్లో భాగంగా నాలుగో రోజు శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తూములూరు గ్రామ శివాలయంలో చిన్నారులు ఏర్పాటు చేసిన మూడు అడుగుల బుజ్జి గణపయ్య విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రాక్టర్‌పై ఉంచి వీధుల్లో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించారు. అనంతరం సమీపంలోని కృష్ణా నదిలోకి నిమజ్జనానికి తరలించారు. విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఐదు కేజీల లడ్డూను లంకిరెడ్డి శేషిరెడ్డి రూ.8,800కు దక్కించుకున్నారు.

హైందవ ధర్మానికి ప్రతీకగా గణేష్ ఉత్సవాలు

తెనాలి టౌన్: హైందవ ధర్మానికి ప్రతీకగా వాడవాడలా, ప్రతి ఇంటా గణేష్ మహోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని నందులపేట బీసీ కాలనీ, ఎన్టీఆర్ సెంటర్, రజకపేట, గంగానమ్మపేటలోని గణేష్ మండపాలను ఆయన సందర్శించి, స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదానాల్లో పాల్గొన్నారు. రాష్ట్రం బాగుండాలని, దేశంలోని రైతాంగం పాడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై మెండుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కాలనీ గణేష్ యూత్, నందులపేటలో పాలడుగు ప్రణీత్ యూత్, సాయిరామ్ యూత్, సిద్ధి వినాయక యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భారీగా అన్నదానం

తెనాలి: పట్టణ బాలాజీరావుపేటలోని రామాలయం వీధిలో గణేష్ మహరాజ్ యూత్ ఆధ్వర్యంలో తొలి వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ కోలాటం, ఉట్టి వంటి కార్యక్రమాలు ఘనంగా జరిపారు. ఐదు రోజుల ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నదానం చేశారు. వెయ్యిమందికి పైగా భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. తెల్లగడ్ల వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని తన్నీరు శివశంకర్, నంధ్యాల నర్సయ్య, చెర్రీ, శశి, రాజు యాదవ్, పీటర్ పాల్, బాషా పర్యవేక్షించారు.

రూ.1.52 లక్షలు పలికిన లడ్డూ

తెనాలి: స్థానిక ప్రగడ కోటయ్యనగర్‌లో పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో 30వ వార్షికోత్సవ గణేష్ మహోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా నాలుగో రోజు ఉదయం నుంచి స్వామికి విశేష పూజలు నిర్వహించారు.



లడ్డూను దక్కించుకున్న తులసిలక్ష్మి

సాయంత్రం స్వామికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూ వేలంపాట నిర్వహించారు. ప్రగడ కోటయ్య నగర్‌కు చెందిన కాటూరి తులసిలక్ష్మి రూ.1,52,000కు దక్కించుకున్నారు. గత ఏడాది రూ1,36,000 పలికిందని, ఈసారి మండల గ్రామాల్లో ఇదే అత్యధిక ధర అని నిర్వాహకులు తెలిపారు. అనంతరం కాళికామాత వేషధారణలు, కనక తప్పెట్లు, మేళతాళాలతో భారీ ఊరేగింపు నిర్వహించి, స్వామిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

తెనాలి టౌన్: స్థానిక షరాఫ్‌బజార్ తులసీరామ్ చౌక్‌లో కైట్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి 20వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. కేరళ వాయిద్య కళాకారుల నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కైట్స్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత, మహిళలు పాల్గొన్నారు.

రూ.2.30 లక్షలు పలికిన లడ్డూ



లడ్డూతో కృష్ణకిశోర్

తెనాలి: స్థానిక బోసు రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో జరుగుతున్న వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్వామి లడ్డూను వేలం వేశారు. పట్టణానికి చెందిన మాజేటి కృష్ణకిశోర్ అత్యధికంగా రూ.2.30 లక్షలకు పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో నంబూరు నరేంద్ర, భాస్కరుని శ్రీనివాసరావు, కంకిపాటి శ్రీమన్నారాయణ, డి.మణిదీప్, సీహెచ్ చంద్ర, నూకల ఆదిత్య, సాధు ప్రతాప్, కొల్లా గురునాథ గుప్త పాల్గొన్నారు.

కమిషనర్‌గా లక్ష్మీపతిరావు సేవలు ప్రశంసనీయం



లక్ష్మీపతిరావును సన్మానిస్తున్న మేనేజర్ జయకర్, ఉద్యోగులు

తెనాలి అర్బన్: విధి నిర్వహణలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు అందరి మన్ననలను పొందారని మేనేజర్ విల్సన్ జయకర్ పేర్కొన్నారు. లక్ష్మీపతిరావు ఉద్యోగ విరమణ సందర్భంగా కొత్తపేటలోని రామకృష్ణ కవి కళా క్షేత్రంలో శనివారం వీడ్కోలు సభను ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జయకర్ మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా తెనాలిలో పనిచేసి, ఇదే మున్సిపాలిటీలో ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేయడం అరుదుగా జరిగే సంఘటనగా పేర్కొన్నారు. ఆయన శేష జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఉద్యోగులంతా నిబద్ధతతో పని చేయడం వల్ల మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ ముువ్వా ఏసుబాబు, సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్ వలి, హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు దావులూరి శ్రీనివాసరావు, ప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, శానిటరీ సెక్రటరీలు, నగర దీపికలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పాస్టర్లకు నూతన వస్త్రాల పంపిణీ



సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

తెనాలి: కెనడాలో ఆకస్మికంగా మృతి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు లెరీ స్మారకార్థ సభను శనివారం మధ్యాహ్నం స్థానిక ఆలపాటి నగర్‌లోని రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో నిర్వహించారు. గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన పలువురు పాస్టర్లతో ఏర్పాటైన జ్ఞాపకార్థ కూడికకు బిషప్ డాక్టర్ గోరికపూడి భాగ్యరాజు అధ్యక్షత వహించారు. లేరీ, ఆయన సతీమణి డెబరో చేసిన సామాజిక సేవను సినీ దర్శకుడు దిలీప్‌రాజా, బిషప్ కోట ఏసుదాసు, పాస్టర్ గిద్యోను, పాస్టర్ ప్రతీక్, పాస్టర్ జక్రయ్య వివరించారు. హాజరైన పాస్టర్లకు లెరీ స్మారకార్థం నూతన వస్త్రాలను దిలీప్‌రాజా పంపిణీ చేశారు. కార్యక్రమానికి పినపాటి సురేష్‌బాబు స్వాగతం పలకగా, రావూరి సురేష్‌బాబు వందన సమర్పణ చేశారు.

పాస్టర్ సుబ్రహ్మణ్యానికి ఘన నివాళి



తెనాలి రూరల్: పాస్టర్ చిలువూరి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థ కూడికను మల్లెపాడులోని ఆయన స్వగృహం వద్ద శనివారం నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సుద్దపల్లి నాగరాజు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మానుకొండ శివప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్, కఠెవరపు దేవయ్య, దుబాయ్ బాబు, దైవ సేవకులు బిషప్ సుధీర్‌కుమార్, ఎ. భానుప్రసాద్, చిలువూరి నతానియేలు, భాగ్యరాజ్, కిషోర్, మాజీ ఎంపీటీసీ పినపాటి సురేష్ బాబు పాల్గొన్నారు.

నిజాయతీతో సేవలు అందించిన వారిని ప్రజలు మరువరు



దుగ్గిరాల: నిజాయతీతో సేవలు అందించిన వారిని ప్రజలు మరిచిపోరని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) తెలిపారు. శనివారం దుగ్గిరాల మండలం చిలువూరులో కేంద్ర ప్రభుత్వ టొబాకో డిపార్ట్‌మెంట్ ఉద్యోగిగా 40 సంవత్సరాలు పనిచేసిన చిలువూరు నాగమల్లేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. నాగమల్లేశ్వరరావు సతీమణి ఫిలోమిన వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) దంపతులు ఇద్దరిని శాలువాతో సన్మానించి, వారికి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షుడు కట్టెపోగు భూషణం, గ్రామ అధ్యక్షుడు షేక్ సుభాని, రజనీకాంత్, ప్రవీణ్, గోపి, కుక్కమళ్ల శేషు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.